andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.1 । కనిష్ఠం 24.2
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 4 సెప్టెంబరు 2024




గోదారమ్మా.. శాంతించు



బాసర, సెప్టెంబరు, 3 : బాసర వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. గత రెండు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో బాసర దేవస్థాన పండితులు శాంతిపూజలు నిర్వహించారు. భక్తుల స్నాన ఘట్టం వద్ద ఆలయ అర్చకుల బృందం మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గోదారమ్మకు సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ రామారావు, ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఆలయ స్థానాచార్యుల ప్రవీణ్‌పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్‌మహారాజ్, ముఖ్య అర్చకులు అచ్యుత్ మహారాజ్, వేద పండితులు నవీన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై ఆరా





- ప్రభుత్వం నుంచి చెరువు భూముల రీ సర్వేకు ఆదేశం
- కోర్టు కేసులు సహా ప్రభుత్వానికి చెరువుల భూముల వివరాల ఫైలు పంపిన అధికారులు
- జిల్లా కేంద్రంలో 14 చెరువులకు గాను 6 చెరువులు ఆక్రమణకు గురైనట్లు అధికారుల నివేదిక
- ధర్మాసాగర్ చెరువులో ఒక గుంట ఆక్రమించి గుడి నిర్మాణం
- మిగతా ఐదు చెరువుల్లోనూ భారీగా ఆక్రమణలు

నిర్మల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన చెరువుల ఆక్రమణపై ఆపరేషన్ నిర్వహిస్తున్న హైడ్రా విధానంలోనే అన్ని జిల్లా కేంద్రాల్లో సర్వేలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో పలుసార్లు చెరువుల ఆక్రమణలపై వివాదాలు జరిగినప్పటికీ అధికారులు తూతూమంత్రంగానే చర్యలు తీసుకున్నా రు. అయితే హైడ్రా తరహా కూల్చివేతలు అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో అధికార యంత్రాంగంపై హడావిడి మొదలైంది. ఇప్పటికే కోర్టుల్లో చెరువుల ఆక్రమణలకు సంబంధించి కేసులు నడుస్తుండగా... మరోవైపు ప్రభుత్వమే చెరువుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించే సూచనలు కనిపిస్తుండడంతో నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు చెరువులకు సంబంధించిన ఆక్రమణల వివరాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇప్పటికే నీటి పారుదలశాఖ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల రాష్ట్ర స్థాయి విజిలెన్స్ యంత్రాంగం చెరువుల ఆక్రమణలపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆగమేఘాల మీద అధికారులు ఫైళ్ళు తయారు చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. గతంలో నిర్మల్‌కు చెందిన న్యాయవాది, ప్రస్తుత బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై అధికారులు ఇప్పటికే ఒక నివేదికను తయారు చేశారు. దానిని ఇప్పుడు రాష్ట్ర ఉన్నతాధికారులకు అధికారులు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో చెరువుల ఆక్రమణదారుల గుండెల్లో రైళ్ళు పరుగులు పెడుతున్నాయి.

జిల్లా కేంద్రంలో 14 చెరువులు.. 6 చెరువుల్లో ఆక్రమణలు

జిల్లాకేంద్రంలో నిమ్మనాయుడు కాలంలో నిర్మించిన 18 గొలుసుకట్టు చెరువులున్నాయి. మొత్తం 14 చెరువులు వాటికి కనెక్టివిటీ కందకాలు కూడా ఉండేవి. అయితే కందకాలు ఇప్పటికే 90శాతం దాక ఆక్రమణలకు గురయ్యాయి. గొలుసు కట్టు చెరువుల కనెక్టింగ్ కాలువల రూపురేఖలు లేకుండాపోయాయి. అయితే చెరువులకు సంబంధించి 14 చెరువులు ఉండగా వాటిలో 4 చెరువుల్లో భారీ మొత్తంలో ఆక్రమణలు జరిగాయి. మరో రెండు చెరువుల్లో ఆక్రమణలు ఉన్నప్పటికి తక్కువ మొత్తంలోనే ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు నివేదికలు ఇచ్చారు. కొన్ని చెరువుల్లోనైతే కుల సంఘాలు, యువజన సంఘాలు, కమ్యూనిటీ హాల్‌లు పెద్దమొత్తంలో నిర్మించడంతో పాటు నివాస గృహాలు ఆక్రమణల రూపంలో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చెరువుల్లో ఇళ్ల నిర్మాణాలు, ప్లాట్లు ఏర్పాటు చేసి అమ్ముకున్నారు. అయితే కొన్ని చెరువుల్లో మాత్రం ఆక్రమణలు అసలే లేవని అధికారులు చెబుతున్నారు. మొత్తం 14 చెరువులకు గానూ 8 చెరువులు అసలు ఆక్రమణల్లో లేవు. 4 చెరువులు పెద్దమొత్తంలో, ఒక చెరువులో అత్యంత పాక్షికంగా ఆక్రమణలున్నాయి. మరో చెరువుకు సంబంధించి చెరువు కింద ఉన్న పట్టేదార్‌లు ఒక కాలువను నిర్మించుకున్న ఆక్రమణలు తేలాయి. ఇవే నివేదికలను కేసులు నడుస్తున్న కోర్టులకు నివేదికల రూపంలో అందించిన అధికారులు తాజాగా ఉన్నతాధికారులు అడిగిన సమాచారం మేరకు నివేదికలను సమర్పించినట్లు తెలిసింది.

నివేదికలు పంపిన అధికారులు

పైన పేర్కొన్న విధంగా జిల్లా కేంద్రంలో ఉన్న చెరువుల ఆక్రమణలపై అధికారులు రికార్డులు సిద్ధం చేశారు. ఈ రికార్డులను ఇప్పటికే హైకోర్టులో నడుస్తున్న కేసుకు సంబంధించి అప్పటి జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఆలీ ఫారూఖీ తన నివేదికను పంపారు. దీనిపై నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు మరోసారి సమీక్షించి చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. దీని ఆధారంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకునే వీలు ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో ఆందోళన మొదలైంది. హైడ్రా విధానంలోనే జిల్లా కేంద్రాల్లోనూ కూల్చివేతల పర్వం మొదలయ్యే అవకాశం ఉందని సమాచారం అందడంతో అధికారులు ఆగమేఘాల మీద తమ వద్ద ఉన్న సమాచారాన్ని ముందస్తుగానే ప్రభుత్వానికి ఒక నివేదిక రూపంలో పంపినట్లు అధికార వర్గాలు చెప్పాయి.

చెరువులు.. ఇవీ ఆక్రమణలు

చెరువు పేరు	చెరువు విస్తీర్ణం (ఎఫ్‌టీఎల్)	చెరువు విస్తీర్ణం	బఫర్ జోన్ ఆక్రమణలు
బంగల్‌పేట్ చెరువు	223 ఎకరాల	18.09 ఎకరాలు	లేవు
ఖజానా చెరువు	81.02 ఎకరాలు	19.11 ఎకరాలు	లేవు
కొత్త చెరువు	29.31 ఎకరాలు	8.12 ఎకరాలు	లేవు
కురాన్నపేట్‌చెరువు	65.32 ఎకరాలు	3.15 ఎకరాలు	మున్నూరు కాపు సంఘం , మత్స్యకార సంఘం, 40 నివాస గృహాలు, 1.10 ఎకరాల్లో మొరంతో పూడ్చి ఆక్రమణ
గొల్లపేట్ చెరువు	37.32 ఎకరాలు	1.03 ఎకరాలు	లేవు
ఇబ్రహీం చెరువు	76.38 ఎకం	5.36 ఎకరాలు	స్లాటర్‌హౌజ్, గ్రేవ్ యార్డ్, ఎలక్ట్రిసిటి సబ్ స్టేషన్, మున్సిపల్ అధికారులు నిర్మించిన బౌండరీ వాల్
కంచరోణి చెరువు	76.39 ఎకరాలు	11.10 ఎకరాలు	ఓపెన్‌ప్లాట్, నివాస గృహాలు, గుడి నిర్మాణం, స్కూల్ కౌంపౌండ్ వాల్, ప్రైవేటు స్కూల్ బిల్డింగ్
ధర్మాసాగర్ చెరువు	65.10 ఎకరాలు	లేదు	ఒక గుంట స్థలంలో గుడి నిర్మాణం మినహా ఆక్రమణలు లేవు
మోతి తలాబ్	178.02 ఎకరాలు	19.16 ఎకరాలు	లేవు
మంజులాపూర్ చెరువు	84.18 ఎకరాలు	15.11 ఎకరాలు	ఓపెన్‌ప్లాట్స్, నివాస గృహాలు

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు : నిర్మల్ పట్టణంలోని శ్రీగిరి క్షేత్రంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం కావడి సేవలు ఘనంగా నిర్వహించారు. పన్నీరు కావడి, పుష్ప కావడి, పాల కావడి పూజల్లో భక్తులు పాల్గొన్నారు. గురుస్వామి శనిగారపు చిన్నయ్య, రావుల రాజవ్వ, దినేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సంచార పుస్తక వాహనం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 3 : రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార పుస్తక వాహనాన్ని మంగళవారం కలెక్టర్ అభిలాష అభినవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా సంచార పుస్తక వాహనం పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తుదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు రూమ్ టు రీడ్ చేస్తున్న కృషి అభినందించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, రూమ్ టు రీడ్ ఇన్‌చార్జి రవి, తదితరులు పాల్గొన్నారు.

మామడ తండాలో తీజ్ ఉత్సవాలు

నిర్మల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు 3 : మామడ తండాలో మంగళవారం రోజున తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయ దుస్తులు ధరించి పంట పొలాలు వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ పండుగ చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, ఆయురారోగ్యాలతో ప్రజలు ఉండాలని కోరుకుంటూ ప్రత్యేకంగా ఈ పండుగ నిర్వహిస్తున్నట్లు లంబాడా సోదరులు తెలిపారు. ప్రతిఏటా వర్షాకాలంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హన్మ గడ్, పూజారి గంగారాం, గణేష్, సంతోష్, సూర్య, గంగాధర్, మోహన్, వసంత్, భీమ్లా, తదితరులు ఉన్నారు.

'సబ్‌స్టేషన్ సిబ్బందిని నియమించాలి'

ముథోల్, సెప్టెంబరు 3 : మండల కేంద్రమైన ముథోల్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌లో తగు సిబ్బందిని నియమించాలని మాజీ ఎంపీటీసీ దేవోజి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఏడీఈ లక్ష్మణ్, ఏఈ శ్రీకాంత్‌లకు వినతి పత్రం అందజేశారు. ముథోల్ మండల కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు తగు సిబ్బంది లేక త్వరగా విద్యుత్ అందించడంలో విద్యుత్ అధికారులు విఫలం చెందుతున్నారని పేర్కొన్నారు.

బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది

- అన్ని చోట్ల పకడ్బందీ చర్యలు తీసుకున్నాం
- జిల్లా కేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీని సందర్శించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- శాస్త్రీయ అధ్యయనం జరిపిస్తానంటూ హామీ



జీఎన్ఆర్ కాలనీ పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



జీఎన్ఆర్ కాలనీ సమస్యల గురించి తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

నిర్మల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భారీవర్షాలు, వరదలతో సమస్యలను ఎదుర్కొంటున్న ప్రాంతాల ప్రజలను అలాగే నిర్మల్‌లోని జీఎన్ఆర్ కాలనీ వాసులను అన్ని విధాలుగా ఆదుకొని అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మంగళవారం భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో స్థానిక శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిలతో కలిసి మంత్రి పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద నీటి వలన ఏర్పడుతున్న ఇబ్బందులను కాలనీ ప్రజలు మంత్రికి వివరించారు. స్వర్ణప్రాజెక్టు కింద చెక్ డ్యామ్ నిర్మాణం, స్థానికంగా ఉన్న నాళాల ఆక్రమణ కారణంగా వరదనీరు సక్రమంగా ప్రవహించక నీరు కాలనీలోకి చేరుతుందని స్థానికులు మంత్రికి తెలిపారు. చెక్‌డ్యామ్ వలన ప్రతి సంవత్సరం పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో నిర్మల్ సమీప గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణాన్ని కుదించి, నాళా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి తద్వారా వరద నీటిని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో వల్ల వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న కాలనీ ప్రజలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధైర్యపడవద్దని, ప్రభుత్వం ప్రజలకు, రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. కాలనీ వాసుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి సాంకేతిక నిపుణులతో చర్చించి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, రైతుల సహకారం అవసరమని తెలిపారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. భారీ వర్షాల హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా వరదల కారణంగా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న నష్టాలు, సమస్యలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి జీఎన్ఆర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. గత కొన్నేళ్లుగా వర్షాకాలం వరదల వలన కాలనీ వాసులు, నిర్మల్ చుట్టు పక్కల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వారి సమస్యను పరిష్కరించాలన్నారు. నిర్మల్ పట్టణంలో వరద నీటి సమస్య పరిష్కారానికై ముఖ్యమంత్రిని కలవనున్నట్లు తెలిపారు. కాలనీ వాసులు, రైతుల సమస్యల పరిష్కారానికి తాము అన్ని విధాలుగా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, డీఎస్పీ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాలనీ వాసులు, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించండి : మంత్రికి వినతి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 3 : జిల్లాలో ఐటీ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏపీజే కలాం ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. మంగళవారం నిర్మల్‌లో పర్యటించిన సందర్భంగా వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు అజహరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరికి కొనసాగుతున్న వరద



బాసర వద్ద గోదావరి పరవళ్లు

బాసర, సెప్టెంబరు, 3: బాసర వద్ద గోదావరి నదికి వరద నీరు పోటెత్తుతుంది. మంగళవారం సైతం నది ఉధృతంగా ప్రవహించింది. ఎగువన మహారాష్ట్రలో సైతం భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటి ప్రవాహ తీవ్రత తగ్గడం లేదు. మహారాష్ట్రలో ఉన్న వివిధ ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు భారీ స్థాయిలో వరద నీరు వదులుతున్నారు. దీంతో మంగళవారం రోజంతా నదిలో 2.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. నీటి ఉధృతి కారణంగా బాసర పుణ్యక్షేత్రంలో భక్తుల స్నానాలను నిలిపివేశారు. ఆలయ సిబ్బందిని స్నానఘట్టాల వద్ద ఉంచి భక్తులు లోనికి వెళ్లకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న చెరువు కట్ట



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కుబీర్, సెప్టెంబరు 3 : గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు డొడర్న చెరువుకట్ట దెబ్బతిని కోతకు గురయింది. మంగళవారం ఉదయం వరకు ఏకదాటిగా వర్షం కురిసింది. మూడు రోజుల పాటు మండలంలో సగటున 126.8మి.మీలు వర్షపాతం నమోదైంది. ఎడతరపి లేకుండా కురు స్తున్న వర్షాలతో గ్రామస్థులు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. వాగులు వంకలు పొంగి పొర్లడంతో వ్యవసాయ పొలాల్లో వర్షపునీరు చేరి పంటకు నష్టం వాటిల్లింది. నది పరివాహన పంటచేలల్లో మట్టి, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. గత వేసవిలో రూ. 4.9లక్షలు మంజూరు చేయగా సంబంధిత గుత్తేదారు, ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా పనులు చేయడంతోనే వర్షాలకు చెరువు కట్ట శిథిలావస్థకు చేరిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సోము ఎంపీవో మోహన్‌సింగ్, రైతులతో కలిసి చెరువు కట్టను పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

అత్యాచార యత్నం చేసిన వ్యక్తికి జైలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 3 : మండలానికి చెందిన ఓ మహిళపై అత్యాచార యత్నం చేసిన అదే గ్రామానికి చెందిన ఎడ్డెన్నోళ్ల శ్రీనివాస్ అనే యువకుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్. ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలానికి చెందిన ఒక మహిళ ఏప్రిల్ 6వ తేదీ 2018లో ఊరు బయటకు బహిర్భూమికి వెళ్లగా అదే గ్రామానికి చెందిన పక్కింటి ఎడ్డెన్నోళ్ల శ్రీనివాస్ అనే యువకుడు ఆ మహిళను చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచార యత్నం చేయగా ఆ మహిళ కేకలు వేస్తూ అతని నుంచి తప్పించుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై హరిబాబు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన నిర్మల్ జూనియర్ సివిల్‌జడ్జి అజయ్ కుమార్ నిందితుడు శ్రీనివాస్‌కు మూడు నెలల జైలుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని



కొట్ల(కె) గ్రామానికి చెందిన డి.రాజేశ్వర్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ. లక్ష ఇరవై వేలు ఉంటుందని వాపోయారు. తమను ఆదుకోవాలంటూ బాధిత కుటుంబం వేడుకుంటుంది.

జిల్లాలో భారీ వర్షాలు

నిర్మల్, సెప్టెంబరు 3 : జిల్లాలో గత మూడు నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 28.4 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లాలో అత్యధికంగా నిర్మల్ రూరల్ మండలంలో 86.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. అలాగే నిర్మల్ మండలంలో 63.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కడెం మండలంలో 53.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యాలు ఈ విధంగా ఉన్నాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 5.954 టీఎంసీలుగా ఉంది. 20,807 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.476 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువప్రాంతం నుంచి 12 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 1.145 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 550 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది.

ఇళ్లు కూలిన బాధితులకు ప్రభుత్వం సహాయం

ముథోల్, సెప్టెంబరు 3 : భారీ వర్షం కారణంగా ముథోల్‌లోని కొలిగల్లీకి చెందిన గంగన్నకు చెందిన ఇల్లు, బోరిగాంలోని సైదుల నారాయణకు చెందిన ఇల్లు కూలిపోయింది. అయితే ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ. 4 వేల చొప్పున బాధితుల బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేసినట్లు ఆర్ఐ నారాయణ తెలిపారు.

జిల్లా క్షయ నివారణ కార్యాలయం తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 3: జిల్లా క్షయ నివారణ కార్యాలయంతో పాటు, స్థానిక రిమ్స్‌లోని లాబొరేటరీ, ఏఆర్టీ సెంటర్‌లను డీఎంహెచ్‌వో కృష్ణ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంవో శ్రీధర్, డాక్టర్ సాయిప్రియ, బండారి కృష్ణ ఉన్నారు.

డిగ్రీలో చేరేందుకు స్పెషల్ డ్రైవ్

ఉట్నూర్, సెప్టెంబరు 3: ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు స్పెషల్ డ్రైవ్ కింద ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 9వ తేదీ వరకు దోస్తులో ఆన్‌లైన్‌లో స్పెషల్‌డ్రైవ్ ఫేస్ మిగిలిన సీట్లకై దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 11న సీట్ అలాట్మెంట్, 13వరకు సెల్ఫ్ రిపోటింగ్ చేయాలన్నారు. ఫస్ట్, సెకండ్ థర్డ్ ఫేస్‌లలో సీట్లు రాని విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయాలని, వివరాలకు డిగ్రీ కళాశాల ఉట్నూర్‌లో సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

ఉట్నూర్, సెప్టెంబరు 3: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఉట్నూర్ సీడీపీఓ మాన ఉమా అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్కారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారం సరుకులను క్రమం తప్పకుండా పిల్లలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజులత, ఐసీడీఎస్ టీచర్ పద్మ, మహిళ సంఘం నాయకురాలు మరసుకోల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడిలో నలుగురిపై కేసు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 3: మండలం పరిధిలోని మోర్కండి గ్రామానికి చెందిన సర్పే బాయాబాయి(65) అనే వృద్ధురాలిని అదే గ్రామానికి చెందిన ఇరుగుపొరుగు వారు మంత్రాలు చేస్తోందన్న నెపంతో చితక బాదిన సంఘటనలో మునేశ్వర్ ప్రతాప్, మునేశ్వర్ అరుణ, కానిందే గంగారాం, కానిందే లక్ష్మీలపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. బాధితురాలి తరఫున కానిందే లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

తలమడుగు, సెప్టెంబరు 3: మండలంలోని సాయి లింగి అనాథ ఆ శ్రమంలో సునీత అనే వయో వృద్ధురాలు మంగళవారం ఉదయం మర ణించడంతో ఆమె అంత్యక్రియలను ఆశ్రమం వ్యవస్థాపకుడు దెబ్బడ అశోక్, కమిటీ సభ్యులు గ్రామస్థులతో కలిసి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకి ఎవరూ లేకపోవడంతో బస్టాండ్ వద్ద యాచకురాలిగా ఉండటంతో డాక్టర్ వంశీ కృష్ణ, ఆశ్రమంలో చెర్పించడం జరిగిందని అశోక్ తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీ

మావల, సెప్టెంబరు 3: కల్లెం భూమారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ కల్లెం వెంకటరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఉచితంగా కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై డాక్టర్ వెంకట్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 15 కుట్టు మిషన్‌లు పలువురికి అందజేశారు. ఈసందర్భంగా సేవా భావాన్ని చాటుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు నల్ల నారాయణరెడ్డి, ముడుపు మౌనిష్‌రెడ్డి,చ నలిమెల నవీన్‌రెడ్డి, బీసీ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు, శివప్రసాద్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రవిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కో ఆప్షన్ మెంబర్ రహీమ్‌ఖాన్, వెంకటేష్, ఆడేలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులను సన్మానించిన రైతులు

భీంపూర్, సెప్టెంబరు 3: మండల వ్యవసాయ ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహించిన రవీందర్ బదిలీపై వచ్చిన మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డిలను మంగళవారం మండలంలోని పిప్పల్‌కోటిలో రైతులు, నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి రమేష్, వెంకట రమణారెడ్డి, తాజా మాజీ ఉప సర్పంచ్ దొంతుల సుభాష్, అశోక్‌రెడ్డి, కేమ గంగయ్య, రేణికుంట్ల శ్రీనివాస్, రెండ్ల గోవర్ధన్, రమేష్‌రెడ్డి, రాజలింగు, మలంగ్, తదితరులు ఉన్నారు.

'సామాజిక సేవ కార్యక్రమాలు అభినందనీయం'

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 3: సమాజ శ్రేయస్సును కోరుతూ వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ప్రాథమికవ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డొంగ్రే మారుతి పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మార్కగూడ గ్రామంలో సట్వాజీ ఫడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరుణ్ ఫడ్ జన్మదినం సందర్భంగా ఆదివాసీ గిరిజన మహిళా రైతులకు ఆర్గానిక్ ఎరువులతో పాటు డీస్ ఇన్ ఫెక్ టెంట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొడప భీంరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.జహార్, మాజీ సహకార డైరెక్టర్ మోరే దిలీప్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి : ఎస్సై

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 3: మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో వినాయక నవరాత్రులను శాంతియుతంగా మండపాలను నిర్వహించుకోవాలని ఎస్సై అప్పారావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మండల యువజన సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండపాల వివరాలను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో విధిగా నమోదు చేయాలని, నిమజ్జనం తేదీలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ గటనలు జరగకుండా మండపాల నిర్వాహకులే చూసుకోవాలన్నారు. ఇందులో పోలీసులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీసుతుడు.. పండగకు ముస్తాబు!!


ఇచ్చోడలో తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

ఇచ్చోడ, సెప్టెంబరు 3: వినాయక చవితి సమీపిస్తుండటంతో గణనాథు ల తయారీ ప్రక్రియ తుది ఘట్టానికి చేరింది. రకరకాల గణనాథులను ప్రతిష్ఠించేందుకు మండపాల నిర్వాహకులు ప్రాధాన్యమిస్తుండటంతో వాటిని ప్రత్యేకశ్రద్ధతో తీర్చిదిద్దుతున్నారు. మండలకేంద్రంలోని పాతబస్టాండు సమీపంలో వినాయకుడి విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పూర్తయిన ప్రతిమలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. దీంతో పలు గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులు దగ్గరుండి మరీ రంగులు వేయించి బుకింగ్ చేసుకుంటున్నారు.

బీజేపీతోనే దేశానికి రక్షణ : రమేష్

ఉట్నూర్, సెప్టెంబరు 3: బీజేపీ ఉంటేనే దేశానికి రక్షణ ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని ఐబీ చౌరస్తాలో, ఎన్టీఆర్ చౌరస్తాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీని ప్రధానిగా ప్రజలు ఎన్నుకోవడంతోనే దేశంలో శాంతి నెలకొందని అన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు కోలిపాక రాజశేఖర్, బింగి వెంకటేశ్, రాథోడ్‌శేషారావు, సీపతి లింగాగౌడ్, సాడగే రాజేశ్వర్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెన్‌గంగా భవన్‌లో మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించడం ఎంతో భరోసానిచ్చిందన్నారు. ఎన్నో ఏళ్లుగా మూతబడి ఉన్న సీసీఐ సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే వెనుకబడిన జిల్లాలో ఐటీ టవర్‌ను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట ప్రవీణ్‌రెడ్డి, డేరా కృష్ణారెడ్డి, సంతోష్, తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బోథ్, సెప్టెంబరు 3: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వారిని వెంటనే ఆదుకోవాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కంటేగాం, బాబేరతండా, మరలపెల్లితో పాటు పలు వరద ప్రభావిత గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. అలాగే, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే, పలువురు స్థానిక రైతులు రుణమాఫీ కాలేదని వాపోయారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, డి.శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డ, ఆడే బాబుసింగ్, కాశీనాథ్‌లో పాటు సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో తగ్గుముఖం పట్టిన వర్షాలు

● జిల్లావ్యాప్తంగా నష్టాలను మిగిల్చిన భారీ వర్షాలు ● ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలు మంగళవారం కొంత తగ్గుముఖం పట్టాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో అక్కడక్కడ ఓ మోస్తారు స్థాయిలో వర్షాలు కురిశాయి. అత్యధికంగా నార్నూర్ మండలంలో 74.5 మి.మీల వర్షపాతం కురిసింది. అలాగే ఉట్నూర్ మండలంలో 40.5, భీంపూర్ 26.3, తలమడుగు 16.8, ఇచ్చోడ 16.3, ఇంద్రవెల్లి మండలంలో 16.0 మి.మీల వర్షపాతం కురిసింది. గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నదికి వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టింది. పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని పంట చేన్లు వరదనీటి నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పెన్‌గంగా వరద ఉధృతిని పరిశీలించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని చిల్కూరి రుక్మాబాయి అనే మహిళకు చెందిన ఇళ్లు కూలింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే కుంటాల, పొచ్చెర జలపాతాలు వరదనీటితో పరవళ్లు పెడుతున్నాయి.


దొంగచింత వంతెన వద్ద ఒకపక్క కొట్టుకుపోయిన రోడ్డు

● పంటల నష్టం తెలుస్తున్న అధికారులు

ఉట్నూర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత మూడు రోజులుగా కురుస్తున్న ఏకదాటి వర్షాలు నష్టాలను మిగిల్చాయి. వాగు పరివాహక ప్రాంతాలలో ఉన్న పంట భూముల్లో పొంగిన వాగుల వరద నీరు చేరి రైతులు పండిస్తున్న పంటలు నీటి పాలు అవుతున్నాయి. ఒక ఉట్నూర్ ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, ఉట్నూర్ మండలాల్లో సుమారు 6వేల ఎకరాల వరకు వివిధ పంటలు నష్ట పోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాల ద్వారాతెలుస్తుంది. ఉట్నూర్ మండలంలోని జైత్‌రామ్‌తండా, షాంపూర్, పులిమడుగు, నర్సాపూర్, నాగపూర్, కొత్తగూడ, గంగాపూర్ ప్రాంతాలలోని వాగు పరివాహ ప్రాంతాలో ఉన్న పంటలు నష్టపోయాయని రైతులు పేర్కొంటున్నారు. ఇది ఇలా ఉండగా పులిమడుగు వాగు సమీపంలో రోడ్డు కొట్టుక పోయి గండి ఏర్పడింది. ఉట్నూర్ సీఐ, గండికోట మొగిలి, ఎస్సై మనోహర్‌లు అక్కడికి చేరుకొని రోడ్డుపై భద్రత చర్యలు తీసుకున్నారు. షాంపూర్ నుంచి లక్షెట్టిపేట వెళ్లే దారిలో ఉన్న వంతెన వద్ద రోడ్డుకు గండిపడింది. ఎంపీడీవో రామ్‌ప్రసాద్, ఎంపీవో మహేశ్‌కుమార్‌లు అక్కడికి చేరుకుని రోడ్డు మూసి వేసి ఉన్నందున ప్రజలు ఈ ప్రాంతం నుంచి వాహనాలు నడపవద్దని రెడ్ రిబ్బన్ కట్టారు. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న లక్షెట్టిపేట, భీమ్‌గూడ, పాటగూడ, అల్లిగూడ, కామాయిపేట, బొప్పరికుంట గ్రామాలు దిగ్బంధంలో పడ్డాయి. వీరికి ఎటువైపు నుంచి వెళ్లకుండా వాగులు అడ్డం ఉండడంతో ఉన్న ఒక రోడ్డుకు కూడా గండిపడినందున అధికారులు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇది కాకుండా దొంగచింత గ్రామ సమీపంలో ఉన్న వంతెన వద్ద వరద నీటి ప్రవాహానికి ఒక పక్క రోడ్డు కొట్టుకుపోయింది. అధికారులు తక్షణ మరమ్మతులు చేపట్టాలని దొంగచింత గ్రామపటేల్ కోరుతున్నారు.

● జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తా : ఎమ్మెల్యే

తాంసి: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన బాధిత రైతుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కప్పర్ల గ్రామ సమీపంలో ముంపునకు గురైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. కోతకు గురైన వాగును ఎలా బాగు చేయాలో అక్కడి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా చెడిపోయిన రోడ్డు విషయంపై కూడా నివేదిక సమర్పిస్తానని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల నియోజకవర్గంలో భారీగానే నష్టం వాటిల్లిందని అన్నారు. రైతులు మనోధైర్యంతో ముందడుగు వేయాలని కోరారు. ముఖ్యంగా రోడ్లు, చెరువులు, కుంటల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని అన్నారు. వీటి అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

● ఎకరాకు రూ.40 వేల నష్ట పరిహారం అందించాలి

భీంపూర్: పెన్‌గంగా వరదతో నష్టపోయిన రైతులను ఎకరానికి 40 వేల నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం అధికారులు, నాయకులతో కలిసి భీంపూర్ మండలం అర్లి(టి)లో పెన్ గంగా వరదతో నష్టపోయిన పంట చేల్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్లి చుట్టూ పక్కల దాదాపు 300 ఎకరాల వివిధ పంటలు నష్టపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 40 వేల నష్ట పరిహారం అందించి రెండో పంట వేసుకోవడాన్ని వ్యవసాయ శాఖ ద్వారా స్ప్రింక్లర్‌లు, స్ప్రే పంప్‌లు ఇతర పరికరాలు సబ్సిడీపై అందించి రైతులను ఆదుకోవాలని సూచించారు. రైతులు వరదలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే పంటల పరిశీలించడానికి వచ్చినప్పుడు సంబంధిత మండల వ్యవసాయ అధికారి అందుబాటులో లేకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో తాజా మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, తాజా మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, డీసీసీబీ డైరెక్టర్ బక్కి గోవర్ధన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● ఉధృతంగా ప్రవహిస్తున్న తలమడుగు వాగు

తలమడుగు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో మండలంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో జల జీవనం స్తంభించిపోయింది. మంగళవారం తలమడుగు వాగు మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. తలమడుగు పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై అంజమ్మలు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. కాగా భారీ వర్షాల పట్ల మండలవాసులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.


అర్లి(టి)లో పంట చేలను పరిశీలించడానికి వాగునుదాటి వెళ్తున్న ఎమ్మెల్యేఅనిల్ జాదవ్

● వరద నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం

భోథ్: మండలంలోని దన్నూర్(బి) వాగు ప్రవాహానికి కోతకు గురైన కల్వర్టులను రోడ్డును మంగళవారం బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.రాజు యాదవ్‌తో కలిసి కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. అంతేగాక నది పరివాహక ప్రాంతంలో ముంపుకు గురైన పంటను పరిశీలించారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.చంటి, యువజన కార్య జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై.ఇంద్రారెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ అబుదల్ నితిన్, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

● ఏకధాటి వర్షానికి కూలిన ఇల్లు

బజార్‌హత్నూర్: మండలం పరిధిలో మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వలన బూతాయి, బజార్‌హత్నూర్ గ్రామాలలోని ఇళ్లు కూలిపోయి ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, సామగ్రి మొత్తం తడిసి పోయాయని బాధితులు తెలిపారు.


బోథ్‌లో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మత్తడి వాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

తాంసి, సెప్టెంబరు 3: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. మంగళవారం ఉదయం రెండున్నర గంటల పాటు కుండపోతగా కురియడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా మంగళవారం మధ్యాహ్నానికి 276.70 మీటర్లకు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన సంబంధిత శాఖ అధికారులు మూడు గేట్లు ఎత్తివేశారు. దీంతో 1160 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1220 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. కాగా ఆయా గ్రామాల్లో ఉన్న వాగులు, వంకలు, చెరువులన్నీ పూర్తిగా నిండిపోయి పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి.


ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న నీటి ప్రవాహం

వరద బాధితుడిని కాపాడిన గ్రామస్థులు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 3: మండలకేంద్రంలోని జవాహర్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ వంతెన వరద ఉధృతితో పొంగి పొర్లడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలకేంద్రానికి చెందిన వ్యక్తి వంతెనను దాటే ప్రయత్నంలో వాగు ఉధృతికి కొంతదూరం కొట్టుకుపోయి చెటుకొమ్మను పట్టుకున్నాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు వెంటనే తాడు సహాయంతో ఆ వ్యక్తిని వరద నుంచి కాపాడారు.

పిడుగు పాటుకు గేదె మృతి

ఉట్నూర్: మండల కేంద్రంలోని రైతు సాడిగే రాజేశ్వర్‌కు చెందిన గేదెపై మంగళవారం పిడుగు పడడంతో మృతి చెందిందని రైతు తెలిపారు. పశువుల కాపరికి త్రుటిలో ప్రమాదం తప్పిందని తెలిపారు. పాడి గేదె మృతి చెందడం వల్ల రూ.లక్ష నష్టం ఏర్పడిందని, ఆదుకోవాలని కోరారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి

నీటి విడుదల నిలిపివేత

● 6805 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


నిండుకుండల దర్శనమిస్తున్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు

భైంసా, సెప్టెంబరు 3 : ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో మంగళవారం గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి వరదనీటి చేరిక 12 వేల క్యూసెక్కుల నుంచి 6805 క్యూసెక్కులకు తగ్గిపోయింది దీంతో ఉదయం పరిస్థితిని సమీక్షించిన ప్రాజెక్టు నిర్వాహణాధికారులు గడ్డెన్నవాగు ప్రాజెక్టు మూడు వరద గేట్లను మూసివేసి సుద్దవాగులోకి నీటి విడుదలను నిలిపివేసారు. సోమవారం దినమంతా ప్రాజెక్టులోకి 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా మూడు వరద గేట్ల ద్వారా అంతే మొత్తంలో క్యూసెక్కుల వరద నీటిని సుద్దవాగులోకి విడుదల చేశారు. మంగళవారం ఇన్‌ఫ్లో 6805 క్యూసెక్కులకు తగ్గిపోయిన దరిమిలా పరిస్థితిని సమీక్షించిన ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వరద గేట్లను మూసివేసి నీటి విడుదలను నిలిపివేసారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 358.2 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వలతో ప్రాజెక్టు నీటి కుండాల మారింది. వర్షాలు, ఇన్‌ఫ్లో పరిస్థితులకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు నిర్వహణాధి కారులు వెల్లడించారు.

ఘనంగా పొలాల అమావాస్య పూజలు


మట్టి ఎడ్ల ప్రతిమలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

దస్తురాబాద్, సెప్టెంబరు 3 : మండల కేంద్రంలో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నేతకాని కులస్థులు రైతులు పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు నేతకాని కులస్తులు నల్ల మట్టిని తెచ్చి ఎడ్ల ప్రతిమలను తయారు చేసి దేవుని దగ్గర ఉంచి పెద్దలకు నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేకపూజలు చేసి తమ మొక్కులను చెల్లించుకున్నారు. రెండవరోజు మట్టితో తయారు చేసిన ఎడ్ల ప్రతిమలను రంగు రంగులతో అలకరించి వాటిని ఊరేగింపుగా కాలువలు, చెరువుల వద్దకు తీసుకెళ్లి కాలువ, చెరువుల నీటిలో ఎడ్ల ప్రతిమలను నిమజ్జనం చేశారు. మూడవ రోజు గోరుగుల పండుగను నిర్వహించి మహిళలు పెద్ద ఎత్తున బొడ్డెమ్మ ఆటలు ఆడుతూ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి), సెప్టెంబరు 3 : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఎడ్ల పొలాల పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తురాటి గ్రామానికి చెందిన పులి శంకర్, పులి రావుల రైతులు ఎడ్లను అలంకరించి పురాతన సాంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్లను మందిరాల చుట్టూ తింపి మొక్కులు తీర్చుకున్నారు.

బాసర సమస్యలు పరిష్కరించండి

● చిన్నవర్షానికే అమ్మవారి ఆలయానికి లీకేజీలు ● 2027 గోదావరి పుష్కరాల లోపల ఆలయాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది ● ట్రిపుల్ ఐటీకి రెగ్యులర్ వీసీ లేక విద్యార్థులకు ఇబ్బందులు ● గుండేగాం నిర్వాసితులకు న్యాయం చేయండి ● మంత్రి శ్రీధర్‌బాబుకు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ వినతి


మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న దిలావర్‌పూర్ రైతులు

బాసర, సెప్టెంబరు 3 : రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన సరస్వతీ అమ్మవారి ఆలయంలో, రాష్ట్రంలో ఉన్న ఏకైక ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. జిల్లాకేంద్రంలో పర్యటిస్తున్న మంత్రిని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఈ మేరకు విన్నవించారు. దేశంలో ఉన్న రెండో ప్రాచీన దేవాలయంగా పేరొందిన బాసర సరస్వతి అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరుకుందని చిన్నపాటి వర్షానికే అక్కడ పూజలు, భక్తుల దర్శనాలకు వర్షపు నీటితో లికేజీల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం బాసరకు కేటాయించిన 42 కోట్లు జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిని విడుదల చేసి నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. 2027లో గోదావరి పుష్కరాలు ఉన్నాయని అంతకంటే ముందే ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావాలని చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న ఏకైక ట్రిపుల్ ఐటీకి గత పదేళ్ల నుంచి రెగ్యుల్ వీసీ లేకపోవడం పెద్దసమస్యగా మారిందని అన్నారు. పరిపాలనలో లోపాలు తలెత్తి ఎంతో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వారం, పది రోజుల్లో బాసరకు వస్తానని వారికి మంత్రి హామీ ఇచ్చారు.

గుండేగాం నిర్వాసితుల గురించి వినతి

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుండేగాం గ్రామస్తుల సమస్యల గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులైన గ్రామస్తులను ఆదుకోవాలని కోరారు. వాళ్లకు పునరావాస ఏర్పాట్లు చేయాల్సిందని పేర్కొన్నారు. వీటితో పాటు ముథోల్, నిర్మల్ నియోజకవర్గ పరిధిలో లక్ష ఎకరాలకు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 26, 27కు సంబంధించిన పనుల గురించి జిల్లా బీజేపీ నేతలు మంత్రికి వివరించారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై మంత్రికి ఫిర్యాదు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 3 : గుండంపల్లి - దిలావర్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు దిలావర్‌పూర్ రైతులు వినతి పత్రం ఇచ్చారు. పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ వల్ల వాయు కాలుష్యం, నీరు కలుషితం అయ్యే ప్రమాదముందని మంత్రి దృష్టికి తెచ్చారు. కాగా ఇథనాల్ పరిశ్రమ వల్ల కలిగే పర్యవసనాలపై పూర్తి అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇథనాల్ పరిశ్రమపై అధికారులు, రైతులతో కమిటీని వేస్తారని కమిటీ అభిప్రాయం ప్రకారం కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో ఇథనాల్ పరిశ్రమల వ్యతిరేక కమిటీ సభ్యులు కట్కం రాజారెడ్డి, ఆర్గుల రమణ, నప్పల రవి, నవీన్, ధని రవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాల్దే అనిల్, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

● మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ● ఖానాపూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం

ఖానాపూర్, సెప్టెంబరు 3 : వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్ మాల్‌లో ఖానాపూర్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనాల కోసం గోదావరి నది తీరంలో మున్సిపల్ ఆధ్వర్యంలో క్రేన్ల సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి ఇక్కట్లు కలగకుండా రోడ్లపై గుంతలు పూడుస్తామన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్‌తో పాటు శోభాయాత్ర సమయంలో విద్యుత్ తీగలతో ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. వినాయక మండపాల వద్ద నిత్యం కనీసం ఇద్దరు యువకులు కాపలా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్సై లింబాద్రి కోరారు. యువత ఉద్రేకాలకు లోనుకాకుండా నవరాత్రి ఉత్సవాల సమయంలో సంయమనం పాటించాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన శోభాయాత్రను సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా నిర్వహించిన గణేష్ మండళ్ల వారికి బహుమానం అందజేస్తామన్నారు.

అనంతరం హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేష్ మాట్లాడుతూ... మరోసారి వినాయక ఉత్సవ నిర్వాహకులతో హిందూ ఉత్సవ సమితి నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. యువత కూడా సంయమనంతో భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని అత్యుత్సాహం ప్రదర్శించి ఇబ్బందుల పాలవ్వద్దని సూచించారు. పోలీసులు కూడా స్నేహపూర్వకంగా వ్యవహరించి గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, కౌన్సిలర్లు కిషోర్ నాయక్, అబ్దుల్ ఖలీల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, తదితరులున్నారు.

జాతీయస్థాయి వూషూ పోటీలకు

9 మంది నిర్మల్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

భైంసా, సెప్టెంబరు 3 : జిల్లాలోని 9 మంది ఖేలో ఇడియా క్రీడాకారులు జాతీయ స్థాయి వూషూ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని సీతారామకల్యాణ మండపంలో అమెచ్యూర్ వూషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో వూషూ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో జిల్లాలోని ఖేలో ఇండియా శిక్షణ కేంద్రాలకు చెందిన 10 మంది క్రీడాకారులు పాల్గొనగా ముగ్గురు బంగారు పతకాలు, నలుగురు మంది రజత పతకాలు, ఇద్దరు మంది కాంస్య పతకాలు సాధించి 9 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరందరూ వచ్చే నెల ఉత్తరఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 33వ సీనియర్ జాతీయ స్థాయి వూషూ చాంపీయన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారని వూషూ కోచ్ జి. జ్ఞానతేజ తెలిపారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

దస్తురాబాద్, సెప్టెంబరు 3 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీడీ డీఆర్‌డీఏ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని భూత్కూర్, మున్యాల్ గ్రామాల్లో డ్రై డే కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మంచినీటిని వేడి చేసి గోరువెచ్చని నీరు తాగాలన్నారు. వ్యాధుల పట్ల అశ్రద్ధ వహించకుండా వెంటనే చికిత్స చేసుకోవాలని సూచించారు. మండలంలో మహిళా శక్తి క్యాంటీన్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయ్‌కుమార్, ఎంపీడీవో కే. రమేష్, ఎంపీవో రమేష్, ఏపీవో రవి ప్రసాద్, ఏపీఎం గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పెంబి, సెప్టెంబరు 3 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ సైదారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వివిద గ్రామాల యువతతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువత చెడు అలవాట్లకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్, ఏఈవో రాజ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, కానిస్టేబుళ్లు, యువత, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలించిన డీఏవో

కుంటాల, సెప్టెంబరు, 3: మండలంలోని వెంకూర్ చెరువు అలుగు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు అలుగు గుండా ప్రవహించిన నీటిప్రవాహం ఉధృతికి వెంకూర్ గ్రామానికి చెందిన దెబ్బతిన్న, కోతకు గురైన సోయా, పత్తి పంటలను మంగళవారం డీఏవో అంజిప్రసాద్, ఏఈవో గణేష్‌లు పరిశీలించారు. పరిస్థితిని ఉన్నతాధికారులు నివేదించనున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా ప్రతియేటా భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరువు అలుగు గుండా నీరు ఉధృతంగా ప్రవహిస్తూ తమ పంటలు కోతకు గురవుతున్నాయని, అలుగు మరమ్మతులు చేపట్టి తమ పంటలకు నష్టం వాటిళ్లకుండా చూడాలని రైతులు డీఏవో అంజిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఏఓ ఆధ్వర్యంలో రైతు వేదికలో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8; కనిష్ఠం 24.2

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 4 సెప్టెంబరు 2024



తుప్పుపట్టిపోయి కనిపిస్తున్న భారీ యంత్రాలు



జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమ

సీసీఐ పునరుద్ధరణ.. ఉత్తిమాటేనా?

- సీసీఐ పునరుద్ధరణ ఉత్తమాటేనా?!
- జిల్లాలో రాష్ట్ర మంత్రి పర్యటనతో మళ్లీ తెరపైకి సీసీఐ పరిశ్రమ
- గతంలోనే స్ర్కాప్ టెండర్లను పిలిచిన కేంద్ర ప్రభుత్వం
- పార్లమెంట్ ఎన్నికలకు ముందు జిల్లా పర్యటనలో సీసీఐ ఊసెత్తని ప్రధాని మోదీ
- శిథిలమై.. తుప్పుపట్టిపోయినా.. భారీ యంత్రాలు
- పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువు

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో మూతబడిన సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పరిశ్రమను పునరుద్ధరించడం ఉత్తమాటేనా!? అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమ పునరుద్ధరణకు గత 26ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా.. ఆశించిన ప్రయోజనం లేకుండానే పోయింది. గత ప్రభుత్వ హయాంలోనే ఎన్నో రకాలుగా ప్రయత్నాలు జరిగాయి. అయినా కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరణ వైపు మొగ్గుచూపినట్లు కనిపించ లేదు. జిల్లా కేంద్రంలో 772 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న సీసీఐ పరిశ్రమ 170 ఎకరాల టౌన్‌షిప్, 1500 ఎకరాలలో సుమారు 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలను కలిగి ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ సాధన సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు, ధర్నాలు చేపట్టారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించ లేదు. తాజాగా మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ సీసీఐ పరిశ్రమను అకస్మాత్తుగా సందర్శించి పునరుద్ధరణపై మళ్లీ ఆశలు రేపడం జిల్లాలో చర్చనీయాంశం గా మారింది. పరిశ్రమను పునరుద్ధరించడం సాధ్యం కాదంటూ గతంలోనే సీసీఐ వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి నివేదికను ఇచ్చాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పరిశ్రమ పునరుద్ధరణకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తు న్నామంటూ ప్రకటనలు చేస్తూ తీవ్ర కాలయాపన చేశాయి. అదే మాదిరిగా మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయే తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వెంటనే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పరిశ్రమను పునరుద్ధరించాలంటూ డిమాండ్లు వినిపిస్తున్నాయి.

పునరుద్ధరణ ఎలా సాధ్యం?

సీసీఐ పరిశ్రమ భారీ యంత్రాలు, భవనాలు, ఇతర సామగ్రి పూర్తిగా శిథిలమై, తుప్పుపట్టి పోవడంతో పునరుద్ధరణ సాధ్యపడదంటూ భావించిన కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్ర్కాప్ టెండర్ల కోసం ప్రకటన విడుదల చేసింది. మళ్లీ పరిశ్రమ పునరుద్ధరణపై నేతలు ఆశలు రేపడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో మొత్తం 11 సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం అస్సాం రాష్ట్రంలో బొకాజన్, హిమాచల్‌ప్రదేశ్‌లో రాజ్‌బంద్, రాష్ట్రంలో తాండూర్, మూడు పరిశ్రమలు మాత్రమే అడపాదడపగా పని చేస్తున్నాయి. జిల్లాలో ఉన్న సిమెంట్ పరిశ్రమ గత 26 ఏళ్ల క్రితమే మూత పడిపోయింది. దీంతో ఏళ్ల తరబడి పరిశ్రమ నిర్వాహణ లేకపోవడంతో పరిశ్రమ ప్రాంగణమంతా ఓచిన్న పాటి అడవిని తలపిస్తోంది. ఇప్పటికే కొన్ని యంత్రాలు చోరీకి గురయ్యాయి. ఉన్న యంత్రాలు తుప్పుపట్టిపోయి నేలమట్టమయ్యాయి. గతంలో సిమెంట్ పరిశ్రమ ఆస్తుల విలువ దాదాపుగా రూ.900 కోట్ల వరకు ఉంటుందని సీసీఐ అధికారులు నిర్ధారించారు. అప్పట్లోనే మూతబడిన పరిశ్రమలతో పాటు జిల్లాలోని సీసీఐ పరిశ్రమ ఆస్తులను కూడా వేలం వేసేందుకు సీసీఐ రంగం సిద్ధం చేసింది. అయితే కొందరు కార్మిక సంఘాల నేతలు కోర్టును ఆశ్రయించడంతో ఆస్తుల వేలం ప్రక్రియ వాయిదా పడింది. అప్పటి నుంచి సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై ఊగిసలాటనే కనిపిస్తోంది. ప్రతీసారి ఎన్నికల సమయంలో సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ ప్రచార అస్త్రంగా మారుతుందే తప్ప పునరుద్ధరణకు మాత్రం నోచుకోవడం లేదంటున్నారు.

ప్రధాని సందర్శించి ఉంటే బాగుండేది!!

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ జిల్లాలో పర్యటించారు. దీంతో సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై ఏదో ఒక ప్రకటన ఉంటుందని అందరూ భావించారు. కానీ ప్రధాని మోదీ సీసీఐ పరిశ్రమ జోలికి వెళ్లకుండానే తన ప్రసంగాన్ని ముగించడం జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురి చేసింది. అప్పట్లోనే ప్రధాని నరేంద్రమోదీ సీసీఐ పరిశ్రమను సందర్శించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనుకున్నట్లుగానే జిల్లా పార్లమెంట్ స్థానం, ఆదిలాబాద్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ విజయం సాధించింది. దీంతోనైనా సీసీఐ పునరుద్ధరణకు అవకాశం ఉంటుందని అందరూ భావిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం సీసీఐ పునరుద్ధరణపై ఎలాంటి ప్రకటన చేయడం లేదు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తామని చెబుతున్నా.. ప్రయోజనమే లేకుండాపోతోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తాజాగా సీసీఐ పరిశ్రమను సందర్శించిన స్థానిక ఎంపీ గోడం నగేష్ లేక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీతో కలిసి పరిశ్రమను సందర్శించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమను పునరుద్ధరించాలని పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసినా.. స్పందన కనిపించ లేదు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరిస్తే 3,500 కుటుంబాలకు ఉపాధి కలిగే అవకాశం ఉంటుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. కానీ కేంద్ర ప్రభుత్వంపై సరైన ఒత్తిడి తీసుకు రాకపోవడంతోనే పరిశ్రమ పునరుద్ధరణ కలగానే మారింది.

కేంద్ర ప్రభుత్వమే సీసీఐని పునరుద్ధరించాలి

: ఎస్.విలాస్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు



మూతబడిన సీసీఐ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వమే పునరుద్ధరించాలి. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్ర మంత్రి పర్యటించినా.. ఏ మాత్రం లాభం ఉండదు. బీజేపీ నేతలు రాష్ట్రంపై నిందమోపే ప్రయ త్నం చేస్తున్నారు. ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ జిల్లాకు వచ్చిపోయినా.. పునరుద్ధరణ గతి లేదు. కేంద్ర ప్రభుత్వం సీసీఐని పునరుద్ధరించ కుంటే వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలి. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రయత్నం చేస్తేనే పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యమవుతుంది.

పరిశ్రమ పునరుద్ధరణకు ప్రయత్నాలు చేస్తున్నాం

: పాయల శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్



సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు అన్నిరకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా యి. తరచూ కేంద్ర ప్రభుత్వం పెద్దలను కలుస్తూ పరిశ్రమను పునరుద్ధరించాలంటూ కోరుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారాన్ని అందిస్తే సాధ్యపడుతుంది. స్ర్కాప్‌ను తొలగించిన తర్వాతనే కొత్తగా పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పరిశ్రమ పునరుద్ధరణ కోసం దేనికైనా సిద్ధమే. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్తున్నాం. త్వరలోనే ఓ సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



హస్నాపూర్‌లో రక్షిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

మరణానికి బాధ్యులను గుర్తించాలి

ఉట్నూర్, సెప్టెంబరు 3: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ఇటీవల అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన గిరిజన బాలిక రక్షిత మరణానికి కారకులను వెంటనే అరెస్టు చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్‌కు చేరుకుని రక్షిత తల్లిదండ్రులు నిఖిత-విష్ణు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు హస్నాపూర్ రావడం జరిగిందని, నిజామాబాద్ పోలీసు కమిషనర్, డీఎస్పీలతో కూడా మాట్లాడాలని కేసు చేయడమే కాదు రక్షిత మరణానికి బాధ్యులను గుర్తించి సత్వరమే అరెస్టులు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్‌శ్రీరామ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, తదితరులున్నారు.

తాంసికి బస్సు నడపండి

తాంసి, సెప్టెంబరు 3: మండల కేంద్రమైన తాంసికి పూర్తిస్థాయిలో బస్సు నడవకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్సు నడపాలంటూ మంగళవారం ఆర్టీసీ అధికారులకు యువజన సంఘాల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బస్సు రాని కారణంగా చాలా మంది విద్యార్థులకు విద్యకు దూరం అవుతున్నారని విన్నవించారు. వెంటనే బస్సు నడపాలని, లేనిపక్షంలో తీవ్ర ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, సంతోష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు

భోథ్, సెప్టెంబరు 3: మండలంలోని అందూర్ మందబోగూడ, పాట్నాపూర్, చింతగూడ గిరిజన గ్రామాలలో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులకు గత ఆరు నెలల వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులు లేకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలకు అధికారులు తక్షణమే గ్రామ కార్యదర్శి నియామకం చేపట్టి తమకు న్యాయం చేయాలని పలువురు పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

ఉట్నూర్, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాన్ని మాఫీ చేయగా మండలంలోని శ్యాంపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతుల రుణం మాఫీ కాలేదని కోరుకుంటూ మంగళవారం ఆందోళన చేశారు. అందరికీ పంట రుణాలు మాఫీ అవుతుండగా తమకు మాత్రం రుణాలు మాఫీ కావడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. శ్యాంపూర్ గ్రామానికి చెందిన కేంద్రీ సదానంద్, నారాయణ, దత్త, గంగారాంలతో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ రేషన్‌కార్డు లింకు వల్ల తమకు రుణమాఫీ కావడం లేదంటూ తెలిపారు. ఇప్పటికైనా రేషన్‌కార్డు లింకు తీసివేసి రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు

- రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి శ్రీధర్‌బాబు
- జైనథ్‌లో అధికారులతో కలిసి పెన్‌గంగా వరద ఉధృతి పరిశీలన



సీసీఐ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు



జైనథ్‌లో పెన్‌గంగా నది ముఖచిత్రాన్ని పరిశీలిస్తూ..

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మూతబడిన ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరంచేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లాలో పర్యటించిన మంత్రి శ్రీధర్‌బాబు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి సిమెంట్ పరిశ్రమతో పాటు పెన్‌గంగా నది వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవలే కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణపై చర్చించినట్లు తెలిపారు. పరిశ్రమ పునరుద్ధరణపై కేంద్రం సానుకూలంగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తే ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. సీసీఐ పరిశ్రమను పునురుద్ధరించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. పరిశ్రమ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారుగా 3 ఎకరాల్లో నిర్మిస్తున్న టవర్ ఫేస్ 1ను డెవలప్ చేయడం జరుగుతుందని, దీని ద్వారా 537 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వచ్చే జనవరి చివరి వరకు పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు అధైర్యపడవద్దని అన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే జిల్లాలో పర్యటించడం జరుగుతుందన్నారు. అలాగే ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయలశంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

● డొల్లార వద్ద పెన్‌గంగా వరద ఉధృతి పరిశీలన

జైనథ్: మండలంలోని పెన్‌గంగా నది వరద ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని సరిహద్దున గల డొల్లార వద్ద గల పెన్‌గంగా వరద ఉధృతిని జిల్లా అధికారులు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆయన వెంట ఎమ్మెల్యే పాయల శంకర్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, తదితరులు ఉన్నారు.

కాగా, డొల్లార శేఖాపూర్ శివారులతో మాండగడ గ్రామానికి చెందిన రైతుల భూములు యేటా పెన్‌గంగా వరద ఉధృతికి గురై పంటలు నష్టపోతున్నామని, సర్వే చేసి ఆదుకోవాలని రైతులు మంత్రికి విన్నవించారు.

కమీషన్ల కోసమే పునరుద్ధరణ నాటకం

● జిల్లాకు మంత్రి ఎందుకు వచ్చారో చెప్పాలి : జోగు రామన్న

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీసీఐ పరిశ్రమను ప్రైవేట్ పరం చేసి కమీషన్లను దండుకునేందుకే ఎమ్మెల్యే పాయల శంకర్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి సమాచారం లేకుండా మంత్రి జిల్లాకు ఎందుకు వచ్చారో? చెప్పాలని డిమాండ్ చేశారు. వరదనీటితో పంటలు మునిగి రైతులు ఆందోళనకు గురవుతున్నారని, భరోసానివ్వాల్సిన మంత్రి ఆగమేఘాల మీద సీసీఐ పరిశ్రమను సందర్శించడం ఎందుకో చెప్పాలన్నారు. గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసేది ఏమీ లేదన్నారు. రైతులపై చిత్తశుద్ధి లేని మంత్రి, ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయలశంకర్ రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మంత్రితో కలిసి సీసీఐ పరిశ్రమను సందర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వరద నీటితో కొట్టుక పోయిన పంటలను పరిశీలించుండానే మంత్రి వెళ్లి పోవడం సరైంది కాదన్నారు. ఇందులో రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, రాజు, గండ్రత్ రమేష్, మేస్రం పరమేశ్వర్, అశోక్ స్వామి, తదితరులున్నారు.

● పంట నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించాలి

జైనథ్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల పెన్‌గంగా వరదల వల్ల నష్టపోయిన పంటల నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని కరంజి గ్రామంలో పెన్‌గంగా వరదల వల్ల నష్టపోయిన పత్తి, సోయా కంది, తదితర పంటలను మంగళవారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జైనథ్, బేల మండలంలోని పెన్‌గంగా వరదల వల్ల పదివేల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ విపత్తుగా ప్రకటించి ఎకరానికి రూ.40వేల నష్ట పరిహారాన్ని రైతులకు అందించి ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 3: గణేష్ నవరాత్రి, మిలాద్-ఉన్-నబీ వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మత సంఘాల పెద్దలు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఎక్సైజ్, మున్సిపల్, ఫైర్, నీటి పారుదల శాఖల అధికారులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా హిందూ, ముస్లిం మత పెద్దల అభిప్రాయాలను, సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల7 నుంచి 11 రోజుల పాటు జరిగే వినాయక నవరాత్రి వేడుకలు, 17వ తేదీన జరిగే మిలాద్-ఉన్-నబీ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టి, రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలన్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ శానిటేషన్‌పై ప్రత్యేకదృష్టి సారించాలని, మొబైల్ టాయిలెట్స్ నిమజ్జనం రోజు ఏర్పాటు చేయాలని సూచించారు. పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ తదితర ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరం మేరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ శాఖ ద్వారా సీఎం ఆదేశాల మేరకు ఫ్రీ కరెంట్ ఇవ్వడం జరుగుతుందని, 9440811700కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారి తెలిపారు. ఇందులో ఎస్పీ గౌస్‌ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ, ఆర్డీవోలు వినోద్‌కుమార్, జీవాకర్‌రెడ్డి, శాంతి కమిటీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నైవేద్యాలతో తరలి వెళ్తున్న గిరిజనులు

గ్రామ దేవతలకు గిరిజనుల పూజలు

తాంసి, సెప్టెంబరు 3: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా మంగళవారం మండలంలోని గిరిజనులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలను సమర్పించారు. అంబుగాంవ్, అట్నంగూడ, బేతాళగూడ గ్రామాలకు చెందిన పలువురు గిరిజనులు గ్రామ పొలిమేరలో ఉన్న దేవతలకు నైవేద్యం వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలతో చల్లగా ఉండాలని వేడుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరూ నెత్తి మీద నైవేద్యాలను పెట్టుకుని బయలుదేరారు. వర్షం కురడంతో ఇళ్లల్లోకి పరుగు తీశారు. అనంతరం ఇళ్ళ వద్ద చేసుకున్న వంటకాలను నలుగురికి వడ్డించి పండుగ వాతావరణంను తెలియజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే

నేరడిగొండ, సెప్టెంబరు 3: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని రాజుర గ్రామంలో మంగళవారం జగదాంబ ఆలయ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ప్రతీరోజు గ్రామాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టడంతో దైవభక్తి నెలకొంటుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా దైవనామ స్మరణతో ఆధ్యాత్మికం వైపు పయనించాలని సూచించారు. ఇందులో గ్రామస్థులు పాల్గొన్నారు.

తాంసిలో ప్రబలుతున్న జ్వరాలు

తాంసి, సెప్టెంబరు 3: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వాతావరణ పరిస్థితులో? ప్రభావమో? లేక తాగునీటి కలుషితమో? తెలియదు గాని మండలంలోని చాలా గ్రామాల్లో రోగులు మంచం పట్టారు. ముఖ్యంగా కీళ్లు, కాళ్ల నొప్పులతో పాటు వాంతులు, విరోచనాలతో తీవ్రంగా బాధపడుతున్నారు. దీనిలో భాగంగా గిరిగావ్ గ్రామంలో ఒకరు డెంగీతో మంచం పట్టారు. చాలా మంది గొంతు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అలాగే, నొప్పి అధికం కావడంతో స్థానికంగా ఉండే ఆర్ఎంపీల వద్ద సామాన్య ప్రజలు చికిత్సలు చేయించుకుంటున్నారు. మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వంటి పూట మాత్రమే పని చేస్తుండటంతో రోగులు పూర్తిస్థాయిలో వైద్యాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వెంటనే ఆయా గ్రామాలలో ప్రత్యేక వైద్య చికిత్సలు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.